క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 39, వంకాయ 33, బెండ 35, పచ్చిమిర్చి 85, కాకర 45, బీర 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 50. దొండ 28, ఆలు 21, ఉల్లి 16, గోకర 45, దోస 18, సొర 11, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 85, అర్వి 35, మునగ 35, చిలగడదుంప 35, బీట్ రూట్ 34, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 70.
ఈధరలు సోమవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అన్నపూర్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



చంపాపేట: చంపాపేట వార్డు కార్యాలయ సమీపంలో ఆదివారం అన్నపూర్ణ సేవా సంఘం నిర్వాహకులు రవి ముదిరాజ్, భగవాన్‌జీ ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం చేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ...ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేసేందుకు సంఘ సభ్యులు తీర్మానం చేయటంతోనే అన్నదాన కార్యక్రమం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సంతోష్, ప్రవీణ్, శ్రీదర్‌గౌడ్, రాజు, చింటూ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



మొక్కలకు నీళ్ల పోస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: నగర శివార్లలో ఉన్న ప్రతి ఒక్క ఇంటికీ మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలోని ఎస్‌టీపీప్లాంట్ దగ్గర వాటర్ వర్క్స్ అధికారులు మంచి నీళ్ల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, ఇతర జలమండలి అధికారులతో కలసి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఒక రోల్ మోడల్‌గా చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్,మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఒక విజన్‌తో పని చేస్తున్నారని అన్నారు. గతంలో వాటర్ వర్క్స్ జీ.ఎంను కలిసి ఎల్‌బీనగర్‌లో దాదాపు 68 కిలో మీటర్ల మేర నూతన పైప్ లైన్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి అని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, జోనల్ కమిషనర్ పంకజ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లక్ష్మమ్మకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా హుస్నాబాద్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఉప్పల శ్రీనివాస్‌గుప్తను సంప్రదించగా శ్రీనివాస్‌గుప్త ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.39 వేల చెక్కును ఆదివారం బండ్లగూడలోని లక్ష్మమ్మ నివాసానికి వెళ్లి చెక్కును ఉప్పల శ్రీనివాస్‌గుప్త అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆరోగ్యం కోసం నడకలో భాగస్వాములు కావాలి

మలక్‌పేట: పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ దైనందిన జీవితంలో నడకలో భాగస్వాములు కావాలని శాలివాహన వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ పార్కులో ఆదివారం శాలివాహన వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా సామాజిక పరమైన సేవలు చేపడతామన్నారు. క్లబ్‌ను మరింతగా బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తామన్నారు. నడక వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ చక్రపాణి, ప్రధాన కార్యదర్శి ఆవుల ప్రేమ్‌కుమార్ యాదవ్, కోశాధికారి కే.సదానందం కురుమ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో మంచినీళ్ల పండుగ



వనస్థలిపురంలో మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 2014 కు ముందు చాలా కాలనీలలో మంచినీటి సౌకర్యం లేదని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్బన్ మిషన్ భగీరథ కింద ప్రతి కాలనీకి మంచినీరు సరఫరా అవుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి కళ్యాణ మండపంలో జలమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా నది నీటినే కాకుండా గోదావరి జలాలను నగరానికి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. నగరంలో ఎన్నో రిజర్వాయర్లు నిర్మించుకున్నామని, ఒక్క ఎల్‌బీనగర్‌లోనే కొత్తగా 8 రిజర్వాయర్లు నిర్మాణం జరుపుకున్నాయని అన్నారు. నగరంలో గతంలో 8.5 లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా ప్రస్తుతం 14 లక్షలకు చేరుకున్నాయని అన్నారు. ఇళ్లకు 20 వేల లీటర్ల మంచినీటిని ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందని అన్నారు. అలాగే రూ. కోట్లాది నిధులతో 31 సివరేజి ప్లాంట్లను నిర్మించుకోవడం జరిగిందని, 2026 నాటికి మూసీలో కలిసే ప్రతి నీటి బొట్టును శుద్ధిస్తున్నామన్నారు. రూ. 14,000 కోట్ల నిధులతో మూసీకి ఇరువైపులా రోడ్ల నిర్మాణానికి సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్త మాట్లాడుతు గతంలో నగరం, గ్రామాలలో మంచినీటి కోసం బిందెలు పట్టుకుని వెళ్ళేవారని, ఇపుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. ఉచిత మంచి నీరు, 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న జలమండలి సిబ్బందిని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సత్కరించారు. జోనల్ కమిషనర్ పంకజ, డీసీలు సురేందర్‌రెడ్డి, మారుతీ దివాకర్, జలమండలి జీఎం వినోద్, ఏజీఎం రాజగోపాల్, మేనేజర్ సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాలనీ సంక్షేమ సంఘ భవన మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్‌బీనగర్: సీసీ కెమెరాలతో నేరాలను అదుపులో ఉంటాయని, నియోజకవర్గంలో ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్ 1లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిచడంతో పాటు కాలనీ భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ ఏర్పాటుతో నేరం జరిగిన గంటల వ్యవధిలో నేరస్తులను పట్టుకోవచ్చని అన్నారు.అన్ని కాలనీలలో విడతల వారిగా వంద శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి,కాలనీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రభాకర్, నాయకులు రమేష్, రాంబాబు, సాయిరెడ్డి, శివ, శేఖర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మన దేశాన్ని అగ్ర దేశాల సరసన చేర్చిన మోదీ



మన్‌కీ బాత్ ఎపిసోడ్‌ను వీక్షిస్తున్న మధుసూధన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు

చంపాపేట: ప్రపంచ అగ్రదేశాల సరసన మన దేశాన్ని చేర్చిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కర్మన్‌ఘాట్‌లోని పార్టీ కార్యలయంలో డివిజన్ బూత్‌స్థాయి పార్టీ కార్యకర్తలు, సభ్యులతో మన్ కీబాత్ 102వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...నరేంద్ర మోదీ సారధ్యంలో దేశం అన్ని రంగాలలో దూసుకుని పోతుందని అన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, అవినాష్‌రెడ్డి, రాంపురం శ్రీనివాస్, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణగౌడ్, అనిల్, యోగిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



నాగోలు: పాత పేపర్ గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన ఆదివారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. ఎల్‌బీనగర్‌లోని సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న సుధామయి పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ అట్టల కంపెనీలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకున్నాయి. మంటలు పెద్ద ఎత్తున రావడంతో స్థానికులు ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కొండారెడ్డి అనేక వ్యక్తి పేపర్ గోడౌన్‌లో నిర్వహిస్తున్నట్లు సమచారం.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో పాల్గొన్న పీఆర్‌వీపీఎస్ రాజు, సుబ్బయ్య తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటి బ్యాంక్ కృషి చేస్తోందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ సుబ్బయ్య అన్నారు. రామకృష్ణాపురం శాఖ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు అధ్యక్షతన ఆదివారం అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ సొసైటీ 42 శాఖలతో 5 రాష్ట్రాలలో ఒక యూనియన్ టెరిటరీలో చేసిచూస్తూ రూ. 1863. 48 కోట్ల డిపాజిట్లతో రూ. 1606.33 కోట్ల లోన్స్‌లో రూ. 75.76 కోట్ల లాభాలతో పురోభివృద్ధి చెందుతోందన్నారు. బ్యాంక్ వైస్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి, డైరెక్టర్ సోమలింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదానం శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్

నాగోలు: రక్తదానం మహాదానం అని ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా ట్రెజరర్ చల్లా రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేసి తలసేమియా పిల్లలను ఆదుకోవాలని, రక్తదానం వలన ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చువనని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పాండుగౌడ్, విజయ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీని అన్ని విధాలా అబివృద్ధి చేస్తా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ అబివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీలో గత కొంత కాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ చొరవ తీసుకొని పరిష్కరించడంతో ఆదివారం కాలనీ వాసులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాలనీ వాసులు జాన్సన్ పాల్గొన్నారు.

గోశాలకు విరాళం...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మహారాజ్ గోశాలను ఆదవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతి దివాకర్‌తో కలసి సందర్శించారు.ఈ సందర్భంగా గోశాల నిర్వహణకు రూ.11వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మలక్‌పేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మలక్‌పేట: ఉచిత వైద్య శిబిరాలతో పాటు సామాజిక సేవలు విస్తృతపరుస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం మలక్‌పేట అధ్యక్షుడు వనపర్తి రమేష్‌గుప్తా తలిపారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మలక్‌పేట డిమార్ట్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆర్యవైశ్య మహాసభ హైద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లాడి నాగభూషణం హాజరై అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బెలిదె జగన్మోహన్ గుప్తా, ముఖ్య సలహాదారులు చీకట్మర్ల అశోక్‌కుమార్ గుప్తా, నాచం ప్రభాకర్ గుప్తా, మంచికంటి జగన్‌గుప్తా, సురేష్, ప్రసాద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రభుత్వ సాయం రూ. 5 లక్షలకు పెంచాలి



ధర్నా చేస్తున్న తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర నాయకులు

నాగోలు: బీసీ కుల వృత్తుల్లో రజకులకు ప్రభుత్వం సాయం రూ.లక్ష నుంచి 5 లక్షలు పెంచాలని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెదవూరే బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నాగోల్ సాయి నగర్ బీసీకుల వృత్తుల వారికి రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ బీసీల ఆర్థిక , రాజకీయ రంగాలలో పూర్తి వెనకబడిన రజకులకు ప్రభుత్వం దళిత బంధు తరహాలో నిధులు కేటాయించాలని కోరారు. బీఆర్‌ఎస్ కు రజక సామాజిక వర్గం 2014- 18 ఎన్నికల్లో మద్దతుగా నిలిచిందని తెలిపారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని రజకులకు ఐదు లక్షల సాయం ప్రకటించాలన్నారు. ప్రభుత్వం సాయం పొందేందుకు ప్రభుత్వం విధించిన గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆలస్యం అవుతోందని...అధికారులంతా దశాబ్ది ఉత్సవాల్లో తలమునకలై ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడినాల మడివేలు, జి చంద్రశేఖర్, పున్నం రాములు పాల్గొన్నారు

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల జీఎం ఖాదర్ మొహినుద్దీన్

మలక్‌పేట: నియోజవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వాటర్ వర్క్స్ డివిజన్-2(ఏ) ఆధ్వర్యంలో అక్బర్‌బాగ్ ఆఫీసర్స్‌మెస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జనరల్ మేనేజర్ ఖాదర్ మొహినుద్దీన్ అధ్యక్షతన జరిగిన 'మంచినీళ్ళ పండుగ' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు... తొమ్మిది సంవత్సరాలలో వాటర్ సప్లయ్, సీవరేజ్ పనులకు గాను రూ. 20.14 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులను, జలమండలి అధికారులను, జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు డివిజన్‌లో 150 ఎంఎం వాటర్ పైపు లైన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలాంషాహీద్, డివిజన్-2(ఏ) జీఎం ఖాదర్‌మొహినుద్దీన్, డీజీఎం షీలా రాణి, ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, తమ ఉనికి కోసం బీజేపీ నాయకులు సామ రంగారెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు దుయ్యబట్టారు. ఆదివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడారు. బైరామల్‌గూడలో సర్వే నెం.24లో 10 గుంటల భూమని పార్కు అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీకి కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు చెపుతుండగా ఎమ్మెల్యే ఆ స్థలంను కబ్జా చేశారని రంగారెడ్డి ఆరోపించడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. అలాగే గృహస్తులు అక్యుపెన్సీ సర్టిఫికేట్, ఆధార్ అనుసంధానంతో దరఖాస్తు చేసుకుంటే జలమండలి వారు 20 వేల లీటర్ల వరకు నీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నారని, అధిక నీటి బిల్లులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించడం తగదని అన్నారు. ప్రస్తుతం ఎల్‌బీనగర్‌లో 62 శాతం మందికి ఉచితంగా నీటి సరఫరా జరుగుతోందని, మిగతావారు కూడా సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే 100 శాతం మందికి ఉచిత నీరు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, జగదీశ్‌యాదవ్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ సుజాతనాయక్‌కు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని లక్ష్మీ ఎన్‌క్లేవ్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాలనీప్రతినిధులు కార్పొరేటర్ సుజాతనాయక్ వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు చేస్తామని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాలనీలో నూతనంగా ప్రజలకు కమ్యూనిటీ హాలును నిర్మించేందుకు అన్ని విదాలచర్యలు తీసుకుంటామని, కాలనీలో ఉద్యానవనం ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు కార్పొరేటర్ సుజాతనాయక్ హామీయిచ్చారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, ప్రతినిధులు మహాబ్‌అలీ హలీం, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, నాయకులు రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దర్వేజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పోలీసుల దాడి హేయమైన చర్య

ఎల్‌బీనగర్: ఇండ్లు లేని పేదలపై పోలీసులు చేసిన దాడి హేయమైన చర్య అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వేస్లీ ఆరోపించారు. ఇండ్ల స్థలాల పోరాట ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి సాహెబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిప సమావేశంలో పాల్గొన్న వారిపై పోలీసులు లాఠి చేయడాన్ని ఖండించడంతో పాటు గాయపడిన వారిని ఆదివారం సీపీఎం నాయకులు పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దల పేరుతో వేల కోట్ల భూములు కబ్జా చేసి పట్టించుకోని పోలీసులు,ప్రభుత్వం పేదల గుడిసే కోసం ప్రయత్నిస్తే దాడుతకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నాగోలు: కొత్తపేట డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్–2లో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వలిగొండ స్వామి, ప్రధాన కార్యదర్శిగా దుర్గేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే వాజీద్, కోశాధికారిగా కందుల రవిబాబు, సహాయ కార్యదర్శిగా వలిగొండ సురేష్, కమిటి సభ్యులుగా స్వామిగౌడ్, నరేష్‌లు ఎన్నుకున్నారు.

చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

మన్సూరాబాద్: మెడికల్ డిజాస్టర్ చిన్నారులకు అంతర్జాతీయ స్థాయి వైద్య చికిత్సను ప్రజలకు సరసమైన ధరలకు అందించడం సంతోషకరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అశోక ఇంటర్నేషనల్ పెయిన్ మెనేజ్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ పరిధి బాలాజీనగర్‌కాలనీలో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల ప్రవర్తను గమనించి వారిలో తేడాలున్నట్లయితే చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని నిపుణులైన వైద్యులచే పరీక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు డాక్టర్ రాహుల్ గుల్వేటీ, డాక్టర్ కిరణ్ గుల్వేటి, డాక్టర్ సచిన్ గుల్వేటీ, డాక్టర్‌నవిత, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు



పోలీసులను అడ్డుకుంటున్న సీపీఎం కార్యకర్తలు

హస్తినాపురం: హయత్‌నగర్ మండల రెవెన్యూ పరిధిలోని సాహెబ్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడానికి ప్రయత్నించిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి సాహెబ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో కొంతమంది వచ్చి గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సీఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కీసర నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని వెంటనే వదిలిపెట్టాలని పోలీసులను అడ్డుకున్నారు. సీపీఎం నాయకులు జాన్‌వెస్లీ, కే.భాస్కర్, పగడాల యాదయ్య పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి



మినీ ఇండోర్ స్టేడియం కావాలని ఎమ్మెల్యేను అడుగుతున్న చిన్నారులు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీ పరిసర ప్రాంతంలో ఆట స్థలం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ ప్రాంతలో ఆట స్థలం, మినీ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని జైపురికాలనీలో విద్యార్థులు ఆదివారం నాగోలుకు వచ్చిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కలసి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులతో మాట్లాడి త్వరలోనే ఈ ప్రాంతంలో మిని స్టేడియం ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా జైపురికాలనీ ప్రాంతంలో విద్యార్థులకు ఆట స్థలం ఏర్పాటు చేయాలని విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365